క్లుప్తంగా

ఉపాధి పనులు గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ చంద్రమోహన్ తదితరులు

ముమ్మిడివరం: గ్రామసభల ద్వారా ఉపాధి పనులు గుర్తించి నవంబరు 15లోగా మండల స్థాయి ఆమోదం పొంది జిల్లా పరిపాలన ఆమోదానికి పంపాలని ఏపీడీ బి.చంద్రమోహన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ జె.రాంబాబు అధ్యక్షతన శుక్రవారం అమలాపురం క్లస్టర్ పరిధిలోని 8 మండలాల ఉపాధి పథకం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 120 కోట్ల పనులకు సంబంధించి ప్రతిపాదనలు, ప్రణాళికలు సిద్ధం చేయడంపై వివరించారు. సమావేశంలో జి.కవిత, జి.సాగర్, ఎం.త్రినాథ్, బి.శ్వేత, ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప శరణుఘోష



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం అయ్యప్ప స్వామివారి శరణు ఘోషతో మార్మోగింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది అయ్యప్ప భక్తులు శుక్రవారం వీరేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప మాలలు ధరించారు. ఆలయ పండితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు యనమండ్ర సుబ్బారావు, తేజలు అయ్యప్ప భక్తులకు మాలలు వేశారు. వీరు 41 రోజుల పాటు స్వామివారి దీక్ష చేపట్టనున్నారు.

సీఎంఏ విజేత రమ్యశ్రీకి అభినందన



రమ్యశ్రీని అభినందిస్తున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రమణారావు తదితరులు

అమలాపురం టౌన్: ఇటీవల సీఎంఏ–23 జాతీయ స్థాయి పరీక్షల్లో 18వ ర్యాంక్ సాధించిన అమలాపురానికి చెందిన విద్యార్థిని అడ్డగర్ల రమ్యశ్రీని గుడ్ సీడ్ ఫౌండేషన్ అభినందించింది. స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో రమ్యశ్రీని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు సత్కరించారు. ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, పి.రాజేష్, నేరేడుమిల్లి శ్రీను, కుంచే అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ అవార్డు ప్రదానం



అవార్డును స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

యానాం: నేషనల్ సర్వీస్ స్కీమ్ స్టేట్ అవార్డు 2022–23ను యానాంకు చెందిన గుత్తుల శ్రీనివాసరావు అందుకున్నారు. శుక్రవారం పుదుచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి క్రీడలు, యువజన వ్యవహారాల శాఖా మంత్రి నమశ్శివాయం, లాస్‌పేట ఎమ్మెల్యే వైద్యనాథన్ చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన స్వీకరించారు. స్థానిక వివేకానంద పబ్లిక్ స్కూల్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు విద్యార్థుల్లో సామాజిక సేవా దృక్పథాన్ని కలిగించడమే కాకుండా ఆ దిశగా వివిధ సేవా శిబిరాలు నిర్వహించారు. ఆయన్ని పలువురు అభినందించారు.

ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలి

అమలాపురం టౌన్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు లేఖ రాశారు. మంత్రితో పాటు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పాఠశాల విద్యా కమిషనర్‌కు తమ పీడీఎఫ్ తరఫున లేఖలు రాసినట్లు ఎమ్మెల్సీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నల్లబ్యాడ్జీలతో కాంగ్రెస్ నిరసన

అమలాపురం టౌన్: రాహుల్ గాంధీని రావణాసురుడిగా చిత్రీకరించి పోస్టుల్లో పెడుతుందంటూ బీజేపీ వైఖరిపై అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఆ సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలను ధరించి ఆందోళన చేశారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ మహ్మద్ ఆరీఫ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబీ, నాయకులు అయితాబత్తుల సుభాషిణి, కొత్తూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే జగనన్న సంకల్పం

- గ్రామాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు
- నిపుణులచే వైద్య పరీక్షలు

అల్లవరం: పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గోడిలంకలో సర్పంచ్ రుద్రరాజు పవిత్ర అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఆర్డీఓ వసంతరాయుడు హాజరయ్యారు. ఇక్కడి జిల్లా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను ప్రజలకు అందిస్తుందని ఎమ్మెల్సీ తెలిపారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు జేమ్స్‌రాజు, ఎంపీడీఓ కృష్ణమోహన్, డీటీ వీరవెంకట సత్యనారాయణ, డాక్టర్లు సుమ, స్పందన, బాల సుబ్రహ్మణ్యం, లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే లక్ష్యం

తాళ్లరేవు: రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే జగనన్న సంకల్పమని, అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. శుక్రవారం ఇంజరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. గాడిమొగ, తాళ్లరేవు పీహెచ్‌సీల వైద్యులతో పాటు జనరల్ మెడిసిన్, పిల్లల వైద్యులు, గైనకాలజిస్టుల బృందం పరీక్షలు చేసింది. అనంతరం శివన్నారాయణ చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, ఉప సర్పంచ్ కోరుకొండ అప్పారావు, నాయకులు పెయ్యల కొండబాబు, చేదూరి అరవింద్, కోరుకొండ చంటి, బీర సురేష్, కడియాల చినబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇంజరంలో గర్భిణులకు పోషకాహార కిట్లు అందజేసిన ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ, సర్పంచ్ శివరామప్రసాద్



గోడిలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎంపీపీ శేషగిరిరావు



కామనగరువులో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్, ఎంపీపీ



టి.కొత్తపల్లి ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



గొల్లవిల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరోగ్యానికి భరోసా

ఐ.పోలవరం: పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం భరోసాగా నిలుస్తుందని సర్పంచ్ పండు నళిని అన్నారు. టి.కొత్తపల్లి సచివాలయం–2 ప్రాంగణంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నళిని, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఢిల్లీ నారాయణ పర్యవేక్షించారు. గ్రామంలో 532 మందికి వివిధ రకాల వైద్య సేవలను వైద్యులు కె.ఇందిరాశ్రీ, టి.ఆదిత్య పవన్, రమ్య, టి.పవన్ అందించారు. ల్యాబ్ టెస్టులు 190, కంటి పరీక్షలు 38, మెరుగైన వైద్యం కోసం 14 మందిని ఎంపిక చేశారు. సొసైటీ అధ్యక్షులు వడ్డి గౌతమ్, పండు సుమలత, పండు విజయ్‌కుమార్, సవరపు శ్రీను తదితరులు ఉన్నారు.

అమలాపురం రూరల్: వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ భారతలక్ష్మి అన్నారు. కామనగరువు సచివాలయం–2 వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్‌తో కలసి ప్రారంభించారు. కంటి రోగులకు కళ్లజోళ్లు అందజేశారు. 600 మందికి వైద్య పరీక్షలు చేశారు. 15 మందిని ఆరోగ్యశ్రీ సేవలకు ఎంపిక చేశారు. సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఈఓపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, వైద్యులు ములపర్తి శాంతిలక్ష్మి, వాసునాయక్, స్వర్ణకమల, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు రాజులపూడి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: కుల, మతాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తిరిగి వచ్చే ఎన్నికల్లో పట్టంకట్టాలని గొల్లవిల్లి జనసేన ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ కోరారు. గొల్లవిల్లిలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 530 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. జెడ్పీటీసీ గెద్దం సంపదరావు, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు, గొలకోటి దొరబాబు, పరమట సత్యనారాయణ, బడుగు అబ్బులు, సలాది శివాజీ, వీరవెల్లి చినబాబు, చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం మనది

ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

కాట్రేనికోన: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి నిరంతరం పాటుపడుతుందని టీటీడీ సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఉప్పూడి పంచాయతీ పరిధి ఉప్పూడి, నాగి చెరువు, గంటివారిపేట తదితర గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమెల్యే పొన్నాడ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. అర్హత ఉండి పథకాల లబ్ధి చేకూరని వారికి సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారం చూపిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నకు అండగా నిలవాలన్నారు. నాయకులు సలాది తులసీరావు, ఉచ్చుల రవి, ఎంపీటీసీ ర్యాలి వీరబాబు, నడింపల్లి సూరిబాబు, జెడ్పీటీసీ నేల కిశోర్, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, కాశి హనుమంతరావు, సర్పంచులు గంటి వెంకట సుధాకర్, గుత్తుల వెంకట నాగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

సీఎం జగన్‌తో సంక్షేమ పాలన

ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుందని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం గ్రామ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులకు ఎదుర్లంక వద్ద జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు అతిథి గృహంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథి పొన్నాడ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా త్వరలో ప్రతి గ్రామంలో పథకాల గురించి వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాల్సిన బృహత్తర బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ పటిష్టతకు ప్రతి నెలా మండల సమావేశం నిర్వహించి భవిష్యత్ ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు మాట్లాడుతూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు సమైక్యంగా పని చేద్దామన్నారు. జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి, మిరియం జ్యోతి, ఢిల్లీ నారాయణ, పెన్మత్స వాసురాజు, కాటం సత్తిరాజు, మెండా వెంకన్నబాబు, కాశే రాజుబాబు, పిన్నంరాజు బాబ్జిరాజు, దంతులూరి రాఘవరాజు, మోకా రవి, ఇందుకూరి రంగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

చెడీ తాలింఖానా ప్రదర్శనకు కసరత్తు

అమలాపురం టౌన్: అమలాపురం దసరా ఉత్సవాలకు చెడీ తాలింఖానా ప్రదర్శనలు నిర్వహించే ఏడు వీధుల ఉత్సవ కమిటీలు గురువారం రాత్రి నుంచి ముందస్తు కసరత్తులు మొదలు పెట్టాయి. ఈ నెల 25న జరిగే దసరా ఊరేగింపుల్లో ప్రదర్శనలు ఇచ్చే ముందు రోజు వరకూ ఈ కసరత్తులు కొనసాగుతూనే ఉంటాయి. చెడీ తాలింఖానా ప్రదర్శనల్లో ఉపయోగించే పట్టా కత్తులు, కర్రలు, డాలు, లేడీ కొమ్ములు, బంతుల తాళ్లు తదితర ఆయుధాలను బయటకు తీసి ఆయుధ పూజల ప్రక్రియ పూర్తి చేశారు. ఇక నుంచి ఆయా వీధుల్లో రోజూ రాత్రి సమయాల్లో ఆయుధాలతో తలపడి తర్ఫీదు పొందుతారు. ఈ వీర విద్య గురువులు ఓసారి ప్రదర్శకులకు మెలకువలను నేర్పి ఊరేగింపులకు సిద్ధం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ముందస్తు కసరత్తులో పదేళ్ల లోపు చిన్నారుల నుంచి అన్ని వయస్సుల వారు పాల్గొని తాజాగా మరోసారి ముందస్తు శిక్షణ పొందుతారు. దసరా ఊరేగింపులు నిర్వహించే మహిపాల వీధి, నల్లా వీధి, రవణం వీధి, రవణం మల్లయ్యవీధి, గండువీధి, కొంకాపల్లి, శ్రీరామపురం వీధులు ఒక్కో దేవతామూర్తి విగ్రహ వాహనంతో ఊరేగింపులో పాల్గొంటూ చెడీ తాలింఖానా ప్రదర్శనలు నిర్వహించడం ఓ సంప్రదాయం. దసరా ఊరేగింపు జరుగనున్న రానున్న 20 రోజుల్లో ఆయా వీధుల ప్రదర్శకులు చెడీ తాలింఖానా ముందస్తు కసరత్తులో నిమగ్నమై తర్ఫీదు పొందనున్నారు.



అమలాపురం మహిపాల వీధిలో ముందస్తు కసరత్తులో భాగంగా కర్రలతో తలపడుతూ..

పారదర్శకంగా పథకాల అమలు

అల్లవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండల నోడల్ అధికారి కృష్ణమోహన్, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్ ఆధ్వర్యంలో డి.రావులపాలెంలో మంత్రి విశ్వరూప్ కుమారుడు పినిపే శ్రీకాంత్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎంతో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని శ్రీకాంత్ తెలిపారు. రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జున్నూరి రామారావు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఉండ్రు సుదర్శనరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి శ్రీరామమూర్తి, తిక్కా బాబి, బళ్ల శివ, గోళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డి.రావులపాలెంలో పథకాల గురించి వివరిస్తున్న శ్రీకాంత్

వర్మకు గురుబ్రహ్మ అవార్డు

తాళ్లరేవు: స్థానిక శ్రీసత్యసాయి ఇంగ్లిషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ పట్టా ఆదినారాయణ వర్మ గురుబ్రహ్మ అవార్డును అందుకున్నారు. రాజమహేంద్రవరం గోదావరి టాలెంట్ ఎడ్యుకేషనల్ స్పెషల్ రౌండప్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5న అక్కడి ఆనంద్ రీజెన్సీ హోటల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీహరికోట షార్ డైరెక్టర్ పి.గోపీకృష్ణ సమక్షంలో ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఈ అవార్డును వర్మకు ప్రదానం చేశారు. శుక్రవారం స్థానిక స్కూల్‌లో జరిగిన అభినందన సభలో వర్మ మాట్లాడారు. వర్మను హెచ్ఎం ఎస్ఎస్ రాజు, ఉపాధ్యాయులు మందాల వీరభద్రరావు, కర్నీడి వెంకటరమణ, ప్రకాశరావు అభినందించారు.

చిత్రకళా ప్రదర్శన ప్రారంభం



చిత్రకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న మనువిహార్, పవన్‌కుమార్

అమలాపురం రూరల్: క్రియేటివ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సంస్కార భారతి సౌజన్యంతో వందే వేద భారతం పేరుతో చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు రామాయణం, మహాభారతం, భాగవతం అంశాలపై చిత్రకళా ప్రదర్శన ఉంటుంది. శుక్రవారం దీనిని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మనువిహార్, సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, క్రియేటివ్ ఆర్ట్స్ ఫైన్ అకాడమీ అధ్యక్షుడు అంజి ప్రారంభించారు. విద్యార్థులకు రామాయణ ఇతిహాసాల గురించి తెలిపేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

దసరా ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రాన్ని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీదేవి ఉత్సవ కమిటీ ప్రతినిధులు గంగాబత్తుల వీరవెంకట సత్యనారాయణ (జీవీ), మామిడిపల్లి రాంబాబు, గంగాబత్తుల వెంకటేశ్వరరావు, గంధం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా శ్రీదేవి ఉత్సవ కమిటీ నిర్వహించే ఊరేగింపునకు అనుమతులు ఇవ్వాలని ఎస్పీని వారు కోరారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ శ్రీధర్ వారికి సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉత్సవాలు, ఊరేగింపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నవరాత్రుల్లో నిర్వహించే సాంఘిక, పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనల సమాచారంతో మూడు అడుగుల వెడల్పు, పొడవుతో భారీగా ఈ వాల్ పోస్టర్ ముద్రించడం జిల్లాలోనే ఈ ఉత్సవ కమిటీ ప్రత్యేకతను చాటుతుంది.



దసరా ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా

గ్యాస్ డీలర్లతో సమావేశం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ఎల్పీజీ గ్యాస్‌పై సబ్సిడీ ఇస్తున్న నేపథ్యంలో శుక్రవారం సివిల్ సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఏఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దీనికి వివిధ కంపెనీల గ్యాస్ డీలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ మొబైల్ యాప్ ద్వారా రిజిస్టర్ అయిన వినియోగదారులకు రాయితీ మొత్తం వస్తుందన్నారు. అదేవిధంగా గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు వినియోగదారుల డేటా, ఆధార్ డేటాను సాధ్యమైనంత త్వరగా అందించాలని కోరారు. ప్రభుత్వం ఇస్తున్న గ్యాస్ రాయితీ పథకం జూలై 2023 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి గ్యాస్ బుక్ చేసుకున్న వారందరికీ రాయితీ మొత్తం వినియోగదారుల బ్యాంకు ఖాతాలో పడుతుందన్నారు.



గ్యాస్ డీలర్లతో మాట్లాడుతున్న ఆర్ఏఓ మునిస్వామి

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ రాజీవ్‌గాంధీ స్పోర్ట్స్ స్కూల్‌లో శిక్షణకు రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్ నుంచి యానాం విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని శుక్రవారం హెచ్ఎం టీవీఎస్ఎస్వీ ప్రసాదరావు తెలిపారు. చోడిశెట్టి సీవీఎస్వీ హర్ష అథ్లెటిక్స్‌కు, ఓలేటి సుజిత్ వాలీబాల్‌కు ఎంపికయ్యారన్నారు. వీరిద్దరికీ ఉన్నత విద్య వరకూ ఉచితంగా స్పోర్ట్స్ స్కూల్‌లో ఆయా క్రీడాంశాల్లో శిక్షణతో పాటు, నాణ్యమైన విద్యను అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు నంద్యాల దుర్గారావును అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో స్కూల్ ఉద్యోగులు

సుస్థిర లక్ష్యాలు సాధించాలి

అల్లవరం: పంచాయతీల పరిధిలో ప్రజలకు అందిస్తున్న సేవలపై మండల స్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షించి అభివృద్ధి సుస్థిర లక్ష్యాలు సాధించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్యకుమారి, అదనపు కమిషనర్ ఎస్.సుధాకర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి మండల అధికారులు ఈ వీసీలో పాల్గొన్నారు. పంచాయతీలు అభివృద్ధి సుస్థిర లక్ష్యాలను ఎలా సాధించాలనే అంశంపై అధికారులు వివరించారు. వ్యవసాయ రంగం, పాడి పరిశ్రమ, తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి హామీ పనులు, విద్య, హౌసింగ్ తదితర సేవలపై అధికారులకు సూచనలు చేశారని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. 23 మందితో మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీకి తాను చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. వీసీలో తహసీల్దార్ సాంబశివప్రసాద్, పరిపాలనాధికారి లక్ష్మణరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఏఓ ఎస్వీవీ సత్యనారాయణ, ఏపీఎం సయ్యద్, కార్యదర్శులు పాల్గొన్నారు.



మండల పరిషత్తు కార్యాలయం నుంచి వీసీలో పాల్గొన్న అధికారులు

సమస్యల పరిష్కారానికి కృషి

యానాం: యానాం కోఆపరేటివ్ స్టోర్స్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శుక్రవారం కో ఆపరేటివ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన పి.రామచంద్రయ్య అన్నారు. ఆయన్ని పలువురు సిబ్బంది కలసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పుదుచ్చేరి డీఆర్‌సీఎస్ (లీగల్) అధికారిగా వ్యవహరించి ఆయన బదిలీపై యానాం వచ్చారు.

తగ్గిన ప్రమాదాలు

యానాం: వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పని సరిచేయడంతో పుదుచ్చేరిలో ప్రమాదాలు తగ్గాయని కమిషనర్ ఎస్.శివకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వారికి ఫైన్ విధిస్తున్నామన్నారు. ట్రాన్స్‌పోర్టు శాఖ ద్వారా ఇప్పటి వరకూ నిబంధనలు పాటించని వారి 2 వేల మంది డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశామన్నారు.

ఇన్విజిలేటర్లకు శిక్షణ

యానాం: సర్వే శాఖలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి 8న రాతపరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం ఇన్విజిలేటర్లకు స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ గదిలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ఏఓ మునిస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో సిబ్బంది ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. అదేవిధంగా అభ్యర్థులు వచ్చేటప్పుడు బ్లాక్‌బాల్ పాయింట్ పెన్, హాల్ టికెట్, ఒరిజినల్ గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు.